సాక్షి
సంగారెడ్డి
ఆదివారం । 8 । జనవరి । 2023



బాలకవుల అడ్డా.. సిద్దిపేట గడ్డ
వరకవి సిద్దప్ప, నందిని సిధారెడ్డి నుంచి కథల తాతయ్య ఎన్నవెల్లి రాజమౌళి వరకు ఎందరో కవులతో సిద్దిపేటలో సాహితీ పరిమళం వెదజల్లుతుంది. 10లో



అదృశ్యమై.. చెరువులో శవమై
అప్పుల బాధ భరించలేక ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి శవమై కనిపించిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. 10లో



సమష్టి కృషితోనే అభివృద్ధి
సమష్టి కృషితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. శనివారం జహీరాబాద్ మండల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 11లో

న్యూస్‌రీల్

అడ్మిషన్ గడువు పొడిగింపు



కొండాపూర్(సంగారెడ్డి): ఓపెన్ స్కూల్ 2022–23 సంవత్సరానికి గానూ పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్ గడువును ఈనెల 13వ తేదీ వరకు పొడిగించినట్టు జిల్లా విద్యాధికారి రాజేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణీత ఫీజు కంటే ఎక్కువ వసూలు చేస్తే అధ్యయన కేంద్రాలను రద్దు చేసి శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యాసకులు ఆయా మండలాల్లో గల అధ్యయన కేంద్రాల్లో సంప్రదించి ధ్రువపత్రాలు సమర్పించడంతో పాటు వారి అడ్మిషన్‌ను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. అడ్మిషన్ పొంది టీఎస్ ఆన్‌లైన్, మీ సేవ ద్వారా చెల్లించి రసీదును అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్ ఫారంతో పాటు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ వెంకటస్వామిని సంప్రదించాలని ఆయన సూచించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల అభివృద్ధిలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య సూచించారు. మండలంలోని మంగంపేటలో శనివారం పర్యటించారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, డంప్‌యార్డు, శ్మశాన వాటికను పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న పనులను ఎంపీడీఓ రాములు, సర్పంచ్ ప్రశాంతి, ఈఓ రత్నమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొక్కలను కాపాడేలా ప్రజలు, అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రయాణికులకు ఇబ్బందులు రానివొద్దు



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌ఎం సుదర్శన్

నారాయణఖేడ్: సమయానుకూలంగా బస్సులు నడపాలని, ప్రయాణికులకు ఇబ్బందులు రాకుండా చూడాలని ఆర్టీసీ మెదక్ రీజనల్ మేనేజర్ సుదర్శన్ సిబ్బందికి సూచించారు. ఖేడ్ ఆర్టీసీ డిపోను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖేడ్– లింగంపల్లి మధ్య ప్రారంభమైన ఫైవ్‌స్టార్ బస్సులతో ప్రయాణికులకు గంట సమయం ఆదా అవుతుందన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా ప్రయాణికులకు ప్రత్యేక సర్వీస్‌లను ఏర్పాటు చేయాలని డీఎం మల్లేశయ్య, సహాయ ట్రాఫిక్ మేనేజర్ ప్రవీణ్, మెకానికల్ ఇంజినీర్ ధనుంజయ్‌కు సూచించారు. ఖేడ్ నుంచి హైదరాబాద్‌కు ప్రతీ 20 నిమిషాలకు ఒక బస్సు సర్వీస్ ఉందని, ప్రయాణికులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కరోనా కేసులు నిల్



పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి . శనివారం 47 మందికి ర్యాపిడ్ యాంటిజెన్ పరీక్షలు నిర్వహించగా అందరికీ నెగెటివ్‌గా నిర్ధారణ అయినట్టు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. అదేవిధంగా 46 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్టు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



జహీరాబాద్: నేడు పట్టణంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ట్రాన్స్‌కో డీఈ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణం, మండలంతో పాటు ఝరాసంగం, న్యాల్‌కల్, రాయికోడ్, మొగుడంపల్లి మండలాలు.. కోహీర్ మండలంలోని కొన్ని ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జోరుగా నీటి దందా!

పరిశ్రమలకు విక్రయిస్తూ వ్యాపారం

- భారీగా సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- పట్టించుకోని అధికారులు



కొర్లకుంట-కిష్టాయిపల్లి ప్రధాన రహదారి పక్కన ట్యాంకర్‌లో నీటిని నింపుతున్న దృశ్యం

జిన్నారం(పటాన్‌చెరు): నీటి దందా మూడు పూలు.. ఆరు కాయలుగా నడుస్తోంది. ఏళ్లుగా అ క్రమ వ్యాపారం నడుస్తున్నా సంబంధిత అధికా రులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప లువురు ఆరోపిస్తున్నారు. బోర్లు వేసి భారీగా నీటిని సేకరించి వ్యాపారం చేస్తుండగా.. భూగర్భజలాలు పూర్తిగా అడుగంటి పోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని పారిశ్రామిక వాడల ప్రజలు కోరుతున్నారు.

- జిన్నారం మండలంలోని కిష్టాయిపల్లి, గడ్డపోతారం, బొల్లారం, ఖాజీపల్లి, నల్తూర్, కొర్లకుంట, రాళ్లకత్వ, శివనగర్ గ్రామాల పరిధిలో అక్రమ నీటి వ్యాపారం జోరుగా సాగుతుంది.
- గుమ్మడిదల మండలంలోని బొంతపల్లిలో వంద వరకు నీటి వ్యాపార కేంద్రాలు ఉన్నాయి.
- రోడ్డుకు ఆనుకొని వ్యాపారం నడుస్తున్నా అక్కడి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.
- అర్హత లేని డ్రైవర్లు ట్యాంకర్లు, ట్రాక్టర్ల ద్వారా నీటిని తరలిస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.
- వాహనాల ఫిట్‌నెస్ విషయంలో కూడా ఆర్టీఏ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.
- నిత్యం లక్షల లీటర్ల నీటిని బోర్ల ద్వారా తోడేస్తూ సమీపంలోని పరిశ్రమలకు విక్రయిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.
- స్థానిక అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులే నీటి వ్యాపారం చేస్తుండగా.. వీరిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనకాడుతున్నారు.
- ప్రభుత్వ, శిఖం భూముల్లో నీటి గుంతలను తవ్వి బోర్ల ద్వారా గుంతలు నింపుతున్నారు. మోటార్ల ద్వారా ట్యాంకర్లను నింపి పరిశ్రమలకు నీటిని తరలిస్తున్నారు.
- వ్యవసాయ భూముల వద్ద ఉన్న ఉచిత కరెంట్‌ను సైతం వినియోగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.
- దీంతో సమీపంలోని వ్యవసాయ భూములు బీడుగా మారుతుండగా.. రైతులు వ్యవసాయం చేయడమే మానేశారు.
- మంత్రులు సమీప గ్రామాల పరిధిలో పర్యటించిన సమయంలో ట్యాంకర్లను నిలిపివేసి తర్వాత యథావిధిగా కొనసాగిస్తున్నారు.
- భారీ ట్యాంకర్లతో రోడ్లు ధ్వంసమై గుంతలమయంగా మారుతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.
- అక్రమంగా నీటి వ్యాపారం నడుస్తున్న విషయం రెవెన్యూ, ఇరిగేషన్, గ్రామ పంచాయతీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- అక్రమంగా నీటి వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని, నీటి తరలింపు కేంద్రాలను తొలగించాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ఆయా ప్రాంతాల్లో నీటి తరలింపు విషయం తమ దృష్టికి రాలేదు. నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. తక్షణమే నీటిని తరలిస్తున్న ప్రాంతాలను పరిశీలించి వాహనాల సీజ్‌తో పాటు నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తాం.

– దశరథ్‌సింగ్ రాథోడ్, తహసీల్దార్ జిన్నారం



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

గిరిజనులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాం

ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

పటాన్‌చెరు టౌన్: గిరిజనులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం పటాన్‌చెరులో నిర్వహించిన రాష్ట్ర బంజారా ఎంప్లాయిస్ సేవ సంఘ్ సిల్వర్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పటాన్‌చెరులో వెయ్యి గజాల్లో బంజారా భవన్ నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించడంతో పాటు ఆరు నుంచి పది శాతానికి రిజర్వేషన్ పెంచామని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు కుట్ర చేస్తుందని మండిపడ్డారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో ఐదు తండాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం బంజారా ఎంప్లాయిస్ సేవ సంఘం రాష్ట్ర నాయకులతో కలిసి మంత్రి కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, ఆర్‌టీఐ కమిషనర్ శంకర్‌నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, డీఎస్పీ భీంరెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని.. రోజూ అరగంట వ్యాయామం చేయాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. శనివారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో సుమారు రూ. 17 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆహ్లాదకరమైన పార్కును నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లతో అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. కాకతీయనగర్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్, మయూరి నగర్‌లో పల్లె దవాఖానా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు పుష్ప నగేశ్, సింధు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 11 కందుల కొనుగోలు కేంద్రాలు



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సంగారెడ్డి టౌన్: జిల్లాలో ఈనెల 15వ తేదీ నుంచి కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, సహకార, తదితర శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాలో 90,658 ఎకరాల్లో కంది పంట సాగైందని.. సుమారు 54,394 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశమందని అంచనా వేశారు. జిల్లాలో 11 కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. కొనుగోలుకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం కందులు క్వింటాల్‌కు రూ. 6,600 మద్దతు ధర ప్రకటించిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్లు, డిజిటల్ కాంటాలు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. అదేవిధంగా ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను ఫైనలైజ్ చేసి రవాణా ఏర్పాట్లు చేయాలని, గోడౌన్లను గుర్తించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ అధికారి శ్రీదేవి, వ్యవసాయ శాఖ జేడీ నరసింహారావు, జిల్లా సహకార అధికారి తుమ్మప్రసాద్, స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజర్ బజార్, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

వందశాతం రుణాలు పంపిణీ చేయాలి

డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్‌రావు

వట్‌పల్లి(అందోల్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్వయం సహాయక సంఘాలకు నిర్దేశించిన బ్యాంకు లింకేజీ రుణాలను వందశాతం పంపిణీ చేయాలని డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్‌రావు ఆదేశించారు. శనివారం వట్‌పల్లిలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో వీఓఏ, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు 70 శాతం బ్యాంకు లింకేజీ పూర్తయిందని, మిగిలిన రుణ లక్ష్యాన్ని నెలాఖరులోగా, స్త్రీనిధి రుణాలను ఫిబ్రవరి వరకు అందించాలని సూచించారు. అర్హులైన సంఘాలన్నింటికీ బ్యాంకు లింకేజీ రుణాలు అందించాలన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త వేరు చేసేలా, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు వాడేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్ పనులకు సంబంధించి జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జగదీశ్వర్, ఏపీఎం చంద్రశేఖర్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ డాక్టర్ శరత్ పరిశ్రమల ప్రతినిధులను కోరారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధ పరిశ్రమల ప్రతినిధులు, సీఎస్‌ఆర్ నిధుల జిల్లా పర్యవేక్షణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిశ్రమల యాజమాన్యాలు కంపెనీస్ యాక్ట్ మేరకు సామాజిక బాధ్యతగా అభివృద్ధికి సహకరించాలన్నారు. ఆయా కంపెనీలు గత ఐదేళ్లలో వచ్చిన ప్రాఫిట్, సీఎస్‌ఆర్ కింద జిల్లా, రాష్ట్రంలో వెచ్చించిన నిధులకు సంబంధించి సరైన సమాచారం అందజేయాలని సూచించారు. టర్నోవర్ ప్రాఫిట్‌లో రెండు శాతం సీఎస్‌ఆర్ కింద నిధులు కలెక్టర్ ఖాతాలో జమ చేయాలన్నారు. పరిశ్రమలు ఆప్రాంతంలో ఉన్న ప్రజల అవసరాలను గుర్తించి ఆమేరకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా పరిశ్రమల ఆధ్వర్యంలో జరిగిన పనుల వద్ద కంపెనీ పేరుతో సహా బోర్డు పెడతామని తెలిపారు. ప్రభుత్వం కంపెనీలను ప్రోత్సహిస్తుందని.. సింగిల్ విండో సిస్టం అమలుతో అనుమతులు సునాయాసంగా లభిస్తున్నాయని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజర్షిషా, వీరారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్ కుమార్, సీపీఓ మనోహర్, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, కమిటీలోని ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని రేషన్ షాపులను ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డీజీఎం భాస్కర్‌రావు బృందం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. డివిజన్‌లోని 35, 36 రేషన్ షాపులను సందర్శించి బియ్యం పంపిణీపై ఆరా తీశారు. పొరుగు రాష్ట్రాల వారి వద్ద ఎలాంటి చార్జీలు తీసుకోకుండా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారా..? అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ వనజాత, డీఎం సుగుణ బాయి, డీటీసీఎస్ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి నిరంతర పోరాటం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



మాట్లాడుతున్న చుక్క రాములు

జహీరాబాద్ టౌన్: కార్మికుల సంక్షేమానికి నిరంతర పోరాటాలు చేస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. మహీంద్ర కార్మికులకు వేతన ఒప్పందం జరిగిన సందర్భంగా శనివారం అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా రాములు మాట్లాడుతూ.. గతంలో ఏ సంఘ నాయకులు చేయని విధంగా చారిత్రాత్మక వేతన ఒప్పందం చేయించామని చెప్పారు. వేతనంతో పాటు కార్మికులకు అనేక సౌకర్యాలు కల్పించామన్నారు. గతంలో కంటే ఈసారి జరిగిన ఒప్పందంలో కార్మికులకు లాభం జరిగిందన్నారు. 58 సంవత్సరాల నుంచి 60 ఏళ్లకు పదవీ విరమణ వయసు పెంచామన్నారు. కాంట్రాక్టు కార్మికులకు పర్మినెంట్ చేయించిన ఘనత సీఐటీయూదేనని కొనియాడారు. కొన్ని సంఘాలు కార్మికుల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్మికులంతా ఐకమత్యంగా ఉంటే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు, జిల్లా కార్యదర్శి మహిపాల్, యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, నాయకులు వీరయ్యగౌడ్, కనకారెడ్డి, బాగారెడ్డి, రామరావు, సూర్యకాంత్, కిరణ్, సురేశ్ పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే వరకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సంగారెడ్డిలో నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు ఆధ్వర్యంలో బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి సంగారెడ్డి అసెంబ్లీ పాలక్ కొంపల్లి మోహన్‌రెడ్డి, ప్రభారి జయశ్రీ హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాలని కోరారు. సీఎం కేసీఆర్ అబద్ధాలు చెబుతూ పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటం చేస్తూ ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంత్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కోవూరు సంగమేశ్వర్, జిల్లా నాయకులు, శక్తి కేంద్రం ఇంచార్జిలు, బూత్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

స్టార్టప్‌ల మూత ఆందోళన కలిగిస్తోంది

కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి శ్రీవారి చంద్రశేఖర్



ప్రదర్శనను తిలకిస్తున్న డెలిగేట్లు



మాట్లాడుతున్న శ్రీవారి చంద్రశేఖర్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: దేశవ్యాప్తంగా ఎనిమిది వేల స్టార్టప్ కంపెనీలు వచ్చాయని.. ఆయా స్టార్టప్ కంపెనీలు వేగంగా మూతబడుతుండడం ఆందోళన కలిగిస్తోందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీశాఖ కార్యదర్శి శ్రీవారి చంద్రశేఖర్ అన్నారు. శనివారం హైదరాబాద్ ఐఐటీలో నిర్వహించిన ఇన్నోవేషన్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2021లోనే సుమారు 4,600 స్టార్టప్ కంపెనీలు మూతపడ్డాయని వివరించారు. స్టార్టప్ కంపెనీల ఆవిష్కరణలో దేశం ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉందన్నారు. రాష్ట్ర యూనివర్సిటీల్లో చదువుతున్న విద్యార్థులు ఐఐటీ విద్యార్థులకు ఏమాత్రం తీసిపోరని పేర్కొన్నారు. తెలంగాణ, పాలమూరు వంటి యూనివర్సిటీల్లో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో వారి పరిశోధనలు అంతగా రాణించలేకపోతున్నాయని అన్నారు. హైదరాబాద్ ఐఐటీ రాష్ట్ర యూనివర్సిటీలతో కలిసి పనిచేయాలని సూచించారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి మాట్లాడుతూ.. ఇన్నోవేషన్‌లో అగ్రగామిగా నిలిచేందుకు హైదరాబాద్ ఐఐటీ కంప్యూటేషనల్ ఇంజనీరింగ్ వంటి ఇంటర్ డిసిప్లినరీ ప్రోగ్రాంలను ప్రారంభించామని తెలిపారు. పలు స్టార్టప్ కంపెనీలతో కలిసి హైదరాబాద్ ఐఐటీ పరిశోధనా విభాగాలు అభివృద్ధి చేసిన సుమారు 30 వరకు ఆవిష్కరణలను ఇన్నోవేషన్ డే సందర్భంగా ప్రదర్శించారు. మెటల్ ఇంజనీరింగ్, బయోమెడికల్ తదితర విభాగాల పరిశోధనా విభాగాల ప్రతినిధులు అభివృద్ధి చేసిన ఆవిష్కరణలను ప్రదర్శించారు. అనంతరం హైదరాబాద్ ఐఐటీ పాలకవర్గం చైర్మన్ బీవీఆర్. మోహన్‌రెడ్డి రచించిన 'ఇంజనీర్డ్ ఇన్ ఇండియా' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్నోవేషన్ విభాగం డీన్ ప్రొఫెసర్ సూర్యకుమార్, ప్రాక్చల్ ఆనాలటిక్స్ చైర్మన్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వెన్నెల సాహితీసంగమం సర్వసభ్య సమావేశం శనివారం సిద్దిపేటలో నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గం, సంవత్సర కాలంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఎన్నికల అధికారిగా జి.అశోకరాజు, కొండిమల్లారెడ్డి, పరిశీలకులుగా జె.రాంచందర్‌రావు హాజరయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా జీడిపల్లి రాంచంద్రరావు, అధ్యక్షుడిగా వంగర నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పర్కపెల్లి యాదగిరి, ఉపాధ్యక్షులుగా స్రవంతి మహిపాల్, ఉప్పలపద్మ, త్రివిక్రమశర్మ, కాముని సుధాకర్, కార్యదర్శులుగా గుమ్మన్నగారి బాలసరస్వతి, పిడిశెట్టి రాజు, పిల్లి మహేందర్, అంకుగారి ఉమాశంకర్, కోశాధికారిగా మోరమోహన్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగాఎన్నుకున్నారు.

అదృశ్యమైన తల్లీ బిడ్డ క్షేమం

కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు



మహేశ్వరీతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సందీప్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): అత్తకోడళ్ల గొడవ పడిన ఘటనలో పిల్లలతో సహా కోడలు వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. ఆమె వెతికి పట్టుకుని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. శనివారం ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట్ గ్రామానికి చెందిన మహేశ్వరి గురువారం ఇంటి నుంచి పిల్లలతో వెళ్లి పోయింది. మహేశ్వరీ సోదరుడు రమేశ్ శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు 24 గంటలలో ఆమె నాచారంగుట్టలో ఉన్నట్లు గుర్తించి వెళ్లి పట్టుకున్నారు. మహేశ్వరీని సముదాయించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ అటవీ ప్రాంతం పందివాగు నీటి గుంతలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు నర్సాపూర్ ఎస్‌ఐ గంగరాజు తెలిపారు. అయ్యప్ప ఆలయ నిర్మాణం వద్ద పనిచేసే వాచ్‌మెన్ జక్కుల రాజుకు నీటి గుంతలో మృతదేహం కనిపించింది. రెవెన్యూశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు పోలీసులు తెలిపారు. పోలీసులు చెరువులు వద్దకు వెళ్లి చూడగా మృతుడి వయస్సు 25 నుంచి 30 లోపు ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిస్తే నర్సాపూర్ ఎస్‌ఐ గంగరాజు ఫోన్ నంబర్ 9490617054లో సంప్రదించాలన్నారు.

టెన్నికాయిట్ శిక్షణ శిబిరం ప్రారంభం



పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

సిద్దిపేటఎడ్యుకేషన్: జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు సిద్దిపేట జిల్లా కేంద్రంలో సబ్ జూనియర్ శిక్షణ శిబిరం స్థానిక మినీ స్టేడియంలో శనివారం ప్రారంభమైంది. ఈ శిబిరం ఈనెల 20 వరకు నిర్వహించనున్నారు.

బాలకవుల అడ్డా.. సిద్దిపేట గడ్డ

- సాహిత్యంలో రాణిస్తున్న విద్యార్థులు
- కథల పుస్తకాలు రాస్తున్న స్టూడెంట్స్
- బాలసాహిత్యంలో జిల్లాకు ప్రత్యేక స్థానం



బహుమతులు పొందిన విజేతలు (ఫైల్)

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వరకవి సిద్దప్ప, నందిని సిధారెడ్డి నుంచి కథల తాతయ్య ఎన్నవెళ్లి రాజమౌళి, ఉండ్రాళ్ల రాజేశం, బైతి దుర్గయ్య వరకు అనేక కవులతో జిల్లాలో సాహితీ పరిమళం వెదజల్లుతుంది. బాలసాహిత్యం అనగానే గుర్తుకు వచ్చేది సిద్దిపేట జిల్లా. ఈజిల్లాలో ఎంతో మంది ప్రముఖ బాలసాహితీవేత్తలు, రచయితలు, కవులు ఉన్నారు. ఇందులో ప్రముఖంగా యువకవులది ప్రత్యేక పాత్ర. ఇందులో అధికంగా ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తునే తమ పాఠశాలలో విద్యార్థులకు బాలసాహిత్యంపై అభిరుచి పెరిగేలా ప్రోత్సహిస్తూ, వారిచేత కవిత్వాలు, రచనలు, కథలు, పద్యాలు, గేయాలు రాయిస్తున్నారు. దీంతో పాటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బాల కవిసమ్మేళనాలు, కవితా పోటీలు, పుస్తక సమీక్షలు, కథల పోటీలు, ఉగాది సమ్మేళనాలు, ఉగాది కథల పోటీలు, అష్టావధానం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థుల్లో సాహిత్యంపై అభిరుచి పెరుగుతోంది. జిల్లాలోని జక్కాపూర్, నార్సాయిపల్లి, ఇందిరానగర్, ముబారస్‌పూర్, గుర్రాలగొంది, సికింద్లాపూర్, చేర్యాల, కుకునూరుపల్లి, కొండపాక, మర్కుక్, దొమ్మాట, తదితర పాఠశాలల్లో విద్యార్థులు సాహిత్యంలో రాణిస్తున్నారు. జక్కాపూర్ బడిపిల్లల కథలు, మధుర పద్మాలు, జక్కాపూర్ జక్కనలు, మువ్వలు, సికింద్లాపూర్ సౌరబాలు, మర్కుక్ మాణిక్యాలు, మావురి మర్రి నార్సాయిపల్లి, క్రాంతి కిరణాలు, లలిత పల్లవాలు, విచిత్ర స్నేహం, అడుగు జాడలు, సిక్కిందాపూర్ సౌరబాలు, కుకునూర్‌పల్లి ఆణిముత్యాలు, పర్యావరణ హితం, అక్షర కాంతులు, బాల మందారాలు, బాలకథ మందారాలు, తదితర కథల పుస్తకాలు, గేయాల సంకలనాలు అనేకం ముద్రితం అయ్యాయి. బాల కవులను అభినందిస్తు ప్రముఖ కవులు అభినందనలు తెలుపుతున్నారు. జిల్లాలో ఎదో ఒక చోట బాలలు రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్నారు. రానున్న కాలంలో అనేక మంది బాలసాహితీవేత్తలు జిల్లాలో తయారుకానున్నారు. దీంతో సిద్దిపేట జిల్లా బాలకవులకు అడ్డాగా మారుతుంది.

దినచర్యగా మారింది



మా హిందీ ఉపాధ్యాయులు బైతి దుర్గయ్య సార్, మాకు కథలు, రచనలు, కవిత్వాలు ఏ విధంగా రాయాలో నిత్యం తెలుపుతారు. హిందీతో పాటుగా తెలుగులో కథలు, రచనలు, కవిత్వాలు రాయడం మా పాఠశాల విద్యార్థులకు దినచర్యగా మారింది. నేను ఇప్పటి వరకు రాసిన కథలు అన్ని వివిధ దినపత్రికల్లో ప్రచురితమైనాయి. ప్రముఖ రచయితలు, కవుల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నాను. కూతురు, బంగారు మొక్క, తదితర కథలు నేను రాశాను. మా పాఠశాలలో ప్రతీరోజు సాహిత్యం పై ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నాం. దీంతో మాకు కవిత్వాలు, కథలు, రచనల పై ఆసక్తి పెరుగుతుంది.

– శ్రీజ, బాలకవియిత్రి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జక్కాపూర్.

ఆసక్తి పెరిగింది



మా పాఠశాలలో కథలు, కవిత్వాలు, పద్యాలు, గేయాలు ఏ విధంగా రాయాలో చదవాలో తెలుగు ఉపాధ్యాయురాలు మాధవీలత ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. దీంతో మాకు సాహిత్యంపై ఆసక్తి ఏర్పడింది. దీంతో మేము మా ఉపాధ్యాయుల సహకారంతో పద్యాలు, గేయాలు, కథలు రాస్తున్నాం. అనేక కథలు, గేయాలు అనేక పత్రికలలో ప్రచురితమయ్యాయి, ఉగాది సందర్భంగా బాలకవి సమ్మేళనం, ఉగాది కథల పోటీలు చాలా సంతోషంగా నిర్వహించుకుంటాము.

– గిరిధర్‌రెడ్డి, బాలకవి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సికింద్లాపూర్

లైసెన్సు లేకుండా వ్యాపారం చేయొద్దు



బేకరీలో స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో లైసెన్సు లేకుండా వ్యాపారాలు చేయొద్దని, అలా చేసే వారిపై మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని వ్యాపార సంస్థలను తనిఖీ చేశారు. లైసెన్సు లేకుండా వ్యాపారం చేస్తున్న యజమానులకు అవగాహన కల్పించారు. లైసెన్సు తీసుకోవాలని లేనిపక్షంలో మూసి వేతకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే నిషేధించిన ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గోల్డెన్ బేకరీలో ప్లాస్టిక్ కవర్లు గుర్తించడంతో బేకరీ యజమానికి రూ.5 వేల జరిమానా విధించారు. పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు మున్సిపల్ చట్టానికి లోబడి నడుచుకోవాలన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాధికారి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా శాఖ నూతన సంవత్సర కేలండర్‌ను శనివారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2022–23లో 10వ తరగతి పరీక్షల్లో జిల్లా ప్రథమ స్థానంలో ఉండటానికి కృషి చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో నాణ్యమైన విద్య కోసం తొలిమెట్టును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షుడు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ, గౌరవాధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనా రెడ్డి, ప్రధాన కార్యదర్శి పంతం వెంకటరాజం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రవీంద్రకుమార్, ముక్క రమేశ్, కొండపాక మండల అధ్యక్షుడు నర్ర రామచంద్రారెడ్డి, సిద్దిపేట అర్బన్ అధ్యక్షుడులు కత్తుల బాపురెడ్డి, రాయపోల్ మండల అధ్యక్షుడు బొల్లం రాజశేఖర్, మర్కూక్ మండల అధ్యక్షుడు నారెడ్డి రామకష్టారెడ్డి, నారాయణరావుపేట మండల అధ్యక్షుడు నాగయ్య గారి కిషన్ రెడ్డి, తొగుట మండల అధ్యక్షుడు పుల్లగుర్ల రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్దేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు టి.వెంకటరమణ, మిరుదొడ్డి అధ్యక్షులు వెంకటేష్, సెక్టోరియల్ అధికారులు రామస్వామి, భాస్కర్, నరసింహులు, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలో ఇద్దరు అదృశ్యమైనట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలపారు. శనివారం ఆయన తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. దొంతి గ్రామానికి చెందిన తడుకల మీనా ఈనెల 6వ తేదీన ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఆమె కోసం పలుచోట్ల వేతికిన ఆచూకీ తెలియకపోవడంతో, ఇదే గ్రామానికి చెందిన నవీన్‌పై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదు చేశారు. అలాగే ఓ గ్రామానికి చెందిన బాలిక అదృమైన సంఘటన ఈనెల 5వ తేదీన చోటుచేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తు బాలిక తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 15 మందిని పోలీసులు శనివారం నారాయణఖేడ్ కోర్టులో హాజరుపరిచారు. ఇద్దరికి వారం రోజుల జైలు శిక్ష, 13 మందికి రూ.20 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పినట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడిపి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ నారాయణఖేడ్‌కు చెందిన మన్నెపు అనిల్, సిర్గాపూర్ మండలం జివ్లా నాయక్ తండాకు చెందిన జతోత్ పండరి నాయక్‌లకు వారం చొప్పున జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.

విద్యుదాఘాతంతో ..

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట గ్రామానికి చెందిన రైతు ఎల్లగారి రాజుకు చెందిన పాడిగేదె శనివారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. గేదె మేత మేస్తున్న క్రమంలో ట్రాన్సు ఫార్మర్‌ను తాకడంతో విద్యుదాఘాతంతో అక్కడిక్కడే మృతి చెందింది. కాగా గేదెను ఇటీవల రూ.90 వేలకు కొనుగోలు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.

అదృశ్యమై.. చెరువులో శవమై..



సాయికుమార్ (ఫైల్)

పటాన్‌చెరుటౌన్: అప్పుల బాధ భరించ లేక ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి శవమై కనిపించిన ఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బోరబండకు చెందిన పెనుబాకల సాయికుమార్(32) వ్యాపారం చేసి అప్పులపాలయ్యాడు. గురువారం అమీన్‌పూర్ పెద్దచెరువు వద్దకు వచ్చి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసిన సమాచారం ఇచ్చాడు. వెంటనే కుటుంబ సభ్యులు అక్కడకు వచ్చిచూడగా బైక్, మొబైల్ ఫోన్లు లభించాయి. దీంతో సాయికుమార్ కుటుంబ సభ్యులు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. శనివారం ఉదయం అమీన్‌పూర్ పెద్దచెరువులో మృతదేహం కనుగొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. తమ్ముడు శ్రావణ్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మూర్ఛతో చెరువులో మునిగి వ్యక్తి మృతి



బాబు (ఫైల్)

ములుగు(గజ్వేల్): మూర్ఛ రావడంతో చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కొత్తూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ములుగు ఏఎస్‌ఐ ప్రేమ్‌రాజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తూరు గ్రామానికి చెందిన పెద్దోళ్ల బాబు(30) ఈనెల 5వ తేదీన తన తల్లి సంవత్సరీకం ఉన్నందున తల్లి దుస్తులు, వస్తువులను నాచారం చెరువులో కలిపి వస్తానని 4వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుంటుంబీకులు అతని ఆచూకీ కోసం చుట్టు పక్కల గ్రామాలలో వెతికినా అతడి ఆచూకీ దొరకలేదు. శనివారం అతని మృతదేహం కొక్కొండ గ్రామ చెరువులోతేలింది. ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో మునిగి చనిపోయాడని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న సబ్ కాంట్రాక్టర్ ..

పటాన్‌చెరు టౌన్: ప్రమాదవశాత్తు ఓ భవనం పైనుంచి పడి లేబర్ కాంట్రాక్టర్ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమబెంగల్‌కు చెందిన ఆశిష్ ఇక్బాల్(34) రెండు నెలల క్రితం వచ్చి పటాన్‌చెరు శివారులోని ఏపీఆర్‌లో సబ్ కాంట్రాక్టర్ గా చేరాడు. శనివారం పనులను పరిశీలించేందుకు వెళ్లి రెండో అంతస్తు నుంచి ప్రమాదశాత్తు జారీ పడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో చికిత్స కోసం ఆశిష్ ఇక్బాల్‌ను చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి వరుసకు తమ్ముడైన షేక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన నిందితుడి పోలీసు కస్టడీ

పటాన్‌చెరుటౌన్: వైన్స్ చోరీ కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితుడి కస్టడి ముగిసింది. 2021 సెప్టెంబర్ 30వ తేదీ అర్ధరాత్రి రూ.10 లక్షలు విలువ చేసే మద్యాన్ని గుర్తుతెలియని దుండగులు వాహనంలో వచ్చి ఎత్తుకెళ్లారు. అప్పట్లో వైన్స్ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా మధ్యప్రదేశ్ జైలులో ఉన్న మహారాష్ట్రకు చెందిన సయ్యాద్ హుస్సేన్‌ను పటాన్‌చెరు పోలీసులు 3వ తేదీన కస్టడీలో తీసుకున్నారు. విచారణలో సయ్యాద్ హుస్సేన్‌తో పాటు మొత్తం ఐదుగురు రూ.10 లక్షల విలువైన మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లి రూ.4 లక్షలకు విక్రయించారు. ఈ కేసులో మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. శనివారంలో సయ్యాద్ హుస్సేన్ కస్టడి ముగియడంతో పోలీసులు తిరిగి కోర్టుకు అప్పగించారు.

విద్యార్థికి అండగా నిలిచిన పటాన్‌చెరు సీఐ

- కేన్సర్‌తో తండ్రి మృతి, పక్షవాతంతో తల్లి
- స్కూల్ వెళ్లకుండా పనికి వెళ్తున్న టెన్త్ విద్యార్థి
- సమాచారం తెలుసుకుని స్కూల్‌లో చేర్పించిన సీఐ



టీచర్లతో మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్ రెడ్డి

పటాన్‌చెరుటౌన్: కేన్సర్‌తో తండ్రి మృతి చెందాడు, తల్లి పక్షవాతంతో మంచం పట్టింది. ఇంటికి పెద్ద దిక్కు లేకపోవడంతో ఆ విద్యార్థి చదువు మాని ఇంటి బాధ్యతలు తీసుకున్నాడు. స్కూల్‌కి వెళ్లకుండా టీస్టాల్‌లో పనిచేస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి బాలుడు పనిచేసే చోటుకు వెళ్లి విద్యార్థికి కౌన్సెలింగ్ ఇచ్చాడు. అండగా నిలుస్తానని భరోసా కల్పించారు. మంచిర్యాల జిల్లా ములకల్ల గ్రామానికి చెందిన శంకరయ్య, చంద్రకళ దంపతులు కుమారుడు వంశీకృష్ణతో బతుకు దెరువు కోసం ఎనిమిది సంవత్సరాల క్రితం పటాన్‌చెరు వచ్చారు. కూలి పనులు చేసేవారు. నాలుగేళ్ల క్రితం చంద్రకళ పక్షవాతంతో మంచం పట్టింది. తండ్రి కేన్సర్ తో గతేడాది సెప్టెంబర్ 8వ తేదీన మృతి చెందాడు. దీంతో పదో తరగతి చదువుతున్న వంశీకృష్ణ చదువు మానేసి తల్లి ఆలనా పాలన చూస్తున్నాడు. ఇందుకోసం టీ స్టాల్‌లో పనిచేస్తున్నాడు. 9వ తరగతిలో క్లాస్ టాపర్‌గా వచ్చాడు. విషయం తెలుసుకున్న సీఐ చదువుకు సాయం చేస్తానని, తల్లికి వైద్యం అందేలా చేస్తానని భరోసా ఇచ్చారు. వంశీకృష్ణను తిరిగి పటాన్‌చెరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చేర్పించారు.

కేతకి సన్నిధిలో మాజీ డీజీపీ కుటుంబం



కేతకి ఆలయంలో పూజలు చేసిన మాజీ డీజీపీ, కుటుంబ సభ్యులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయాన్ని మాజీ డీజీపీ దినేశ్ రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి శనివారం సందర్శించారు. ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. అలాగే జిల్లాలో బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో కొనసాగుతున్న శతజయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆశ్రమ నిర్వాహకులు స్వామివారి తీర్థ ప్రసాదలను అందించి, పూలమాల, శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మాతాశ్రీ అనసూయ మాత, ఆశ్రమ పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, భావి పీఠాధిపతి డాక్టర్ సిద్దేశ్వర స్వామి, జహీరాబాద్ రూరల్ సీఐ నోముల వెంకటేశ్, ఝరాసంగం ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి, అర్చకులు, వైదిక పాఠశాల, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీ కొన్న మినీ బస్సు

- తీవ్రంగా గాయపడిన ద్విచక్రవాహనదారుడు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- ఘటన స్థలంలో టీవీఎస్ ఎక్సెల్ దగ్ధం



ప్రమాదంలో మృతిచెందిన మల్లేశం, పక్కనే కాలిపోతున్న ఎక్సెల్ వాహనం

కొల్చారం(నర్సాపూర్): ఎదురుగా వస్తున్న టీవీఎస్ ఎక్సెల్‌ను మినీ బస్సు ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రం కొల్చారం శివారులోని మెదక్–నర్సాపూర్ ప్రధాన రహదారి లోతు వాగు వద్ద శనివారం చోటుచేసుకుంది. కొల్చారం ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొల్చారం గ్రామానికి చెందిన చాకలి మల్లేశం(42) రంగారెడ్డి జిల్లా ప్రగతినగర్‌లో నివాసం ఉంటున్నాడు. కొల్చారంలో మూడు రోజుల క్రితం బంధువు చనిపోవడంతో భార్యాపిల్లలతో కలిసి కొల్చారం గ్రామం వచ్చాడు. మల్లేశం మూడు రోజుల దిన కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. భార్యాపిల్లలను కొల్చారంలోని ఉంచి తిరిగి తన ఎక్సెల్ పై ప్రగతి నగర్‌కు బయలుదేరాడు. లోతు వాగు మలుపు వద్ద నర్సాపూర్ నుంచి వస్తున్న మినీ బస్సుఢీ కొట్టడంతో మల్లేశం కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో ఎక్సెల్ వాహనం పెట్రోల్ ట్యాంక్ పగిలి మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. గాయపడ్డ మల్లేశంను చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని నారాయణ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లేశం మృతి చెందాడు. మల్లేశం భార్య శ్యామమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీసీఎం ఢీ: ఆటో బోల్తా

- ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు
- తూప్రాన్–నర్సాపూర్ రహదారిపై ఘటన



యాదగిరి మృతదేహం

తూప్రాన్: ముందు వేళ్తున్న ఆటోను అతివేగంగా డీసీఎం ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం తూప్రాన్–నర్సాపూర్ రహదారిపై వెంకటాపూర్(పీటీ) గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందని చింతల యాదగిరి(50) కూలీ పనులకు తూప్రాన్ వచ్చి తిరిగి ఇంటికి ఆటోలో వెళ్తున్నాడు. ఆటోలో మొత్తం ముగ్గురు ప్రయాణికులు ఉన్నారు. ఆటో వెంకటాపూర్ గ్రామ సమీపంలోకి వస్తుండగా వెనుక వస్తున్న డీసీఎం వేగంగా వచ్చి ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో యాదగిరి అక్కడిక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు ప్రయాణికులతో పాటు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్ట్ మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్రగాయాలు

వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. దాబాలో భోజనం చేసి రోడ్డు దాటుతున్న లారీ డ్రైవర్‌ను గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. మరోచోట వాకింగ్ చేస్తున్న వ్యక్తిని వెనుక నుంచి బైక్ ఢీకొట్టి వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆటోను బైక్‌ను ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్ రోడ్డు దాటుతుండగా..



గాయపడిన సూరజ్ భారతి

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు దాటుతున్న లారీ డ్రైవర్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్‌కు చెందిన సూరజ్ భారతి లారీ డ్రైవ్ చేసుకుంటూ హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో మనోహరాబాద్ మండలం కాళ్ళకల్ వద్ద జాతీయ రహదారి–44పై దీపక్ దాబా వద్ద లారీ ఆపి భోజనం చేశాడు. అనంతరం రోడ్డు దాటుతుండగా తూప్రాన్ వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీ కొట్టి వెళ్లింది. గమనించిన స్థానికులు 108లో చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీకి తరలించారు.

వాకింగ్ చేస్తున్న వ్యక్తిని..

పటాన్‌చెరుటౌన్: వాకింగ్ చేస్తున్న వ్యక్తిని బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ మండల పరిధిలోని బీఎస్ఆర్ కాలనీ పటేల్‌గూడకు చెందిన భిక్షపతి పటేల్‌గూడ చెరువు వద్ద శుక్రవారం సాయంత్రం వాకింగ్ చేన్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి ఢీతో కొట్టి వెళ్లిపోయాడు. క్షతగాత్రుడిని మదీనగూడలోని ఓప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన భిక్షపతి కుమారుడు శ్రీరాం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్‌కు..

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బీరంగూడ మార్కెట్ వైపు నుంచి కిష్టారెడ్డి పేట వెళ్తున్న ఆటోను ఎల్లమ్మ దేవాలయం సమీపంలో బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో బీరంగూడ మంజీర నగర్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ బోగం కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి భార్య అనురాధ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

వేలం ధర తగ్గించాలి


కలెక్టర్ శరత్‌కు వినతిపత్రం ఇస్తున్న రవికిరణ్

జహీరాబాద్ టౌన్: పట్టణంలో నూతనంగా నిర్మించిన దుకాణాల వేలం పాట దరావత్ ధరను తగ్గించాలని మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు నామ రవికిరణ్ గుప్తా కోరారు. శనివారం కలెక్టర్ శరత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు దుకాణాల వేలం కోసం ప్రారంభ ధర రూ.20 వేలుగా నిర్ణయించడంతో చిన్న వ్యాపారులకు ఇబ్బందిగా మారిందన్నారు. అందరికీ అందుబాటులో ఉండేలా వేలం పాట ధరను ఉంచాలని కోరినట్లు తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీ అందజేస్తున్న చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): మండలంలోని సూరారం గ్రామానికి చెందిన ఖరీముద్దీన్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా అతడికి మంజూరైన రూ.71వేల ఎల్ఓసీ పత్రాన్ని శనివారం చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో వెల్దూర్ సర్పంచ్ పబ్బతి లక్ష్మారెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, మాజీ కోఆప్షన్ సలావుద్దీన్, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ సమ్మేళనం


సమ్మేళనంలో నాయకులు

నారాయణఖేడ్: ఖేడ్‌లోని షెట్కార్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన బీజేపీ బూత్‌కమిటీలో సభ్యులు హాజరయ్యారు. వర్చువల్ ద్వారా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బూత్ కమిటీ సభ్యులతో మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప, మాజీ ఎమ్మెల్యే ఎం.విజయపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఖేడ్ అసెంబ్లీ ప్రభారీ అంబటి బాలేష్, జహీరాబాద్ పార్లమెంటరీ కన్వీనర్ రవికుమార్ గౌడ్, ఖేడ్ అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, కో-కన్వీనర్ మారుతిరెడ్డి, బీజేవైఎం పీఆర్టీ జిల్లా కన్వీనర్ రాజశేఖర్‌గౌడ్, బీజేపీ నాయకులు సాయిరాం, సంజీవ్‌పటేల్, సతీశ్, మండలాల పార్టీల బాధ్యులు, బూత్ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హత్నూర మండల కమిటీ


ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండల కాంగ్రెస్ కమిటీని శనివారం ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు కిష్టయ్య తెలిపారు. కార్యనిర్వాక అధ్యక్షులుగా సత్యం, కృష్ణ, ఉపాధ్యక్షులుగా నరసింహారెడ్డి, నర్సింలు, భాస్కర్ రెడ్డి, నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా శివరాజ్, మహిపాల్ రెడ్డి, యాదగౌడ్, జగన్ యాదవ్, సహాయ కార్యదర్శిగా శ్రీకాంత్, శ్రీకాంత్ రెడ్డి, నరసింహులు, కృష్ణ గౌడ్, కళ్యాణ్ కుమార్, గోపాల్, శంకరయ్య, వెంకటేష్ గౌడ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజు రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర నాయకులు సోమన్నగారి రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి హకీమ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రియాజ్ హలీ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణ, పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత


గుంతలను పూడుస్తున్న కార్మికులు

నారాయణఖేడ్: ఖేడ్-మంగల్‌పేట్ రోడ్డులో జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు చోటుచేసుకోవడంతో శనివారం మున్సిపల్ అధికారులు కార్మికులతో కంకర, ఇసుక, సిమెంట్‌తో గుంతలను పూడ్చివేయించారు.

సమష్టి కృషితో గ్రామాల అభివృద్ధి

- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు
- మండల సమావేశంలో సమస్యలపై చర్చ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: సమష్టి కృషితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. ఎంపీపీ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సహకారం కలిగి ఉండాలని, పల్లెల ప్రగతికి సహకారం అందిస్తానన్నారు. సత్వార్, శేఖాపూర్ గ్రామాల్లో భూసమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. 18 నుంచి ప్రారంభంకానున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లేవనెత్తిన పలు సమస్యలపై ఎమ్మెల్యే స్పందించారు. పంచాయతీ నిధుల మళ్లింపుపై ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళతానని అన్నారు. ఎంపీపీ గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ సర్పంచ్‌లకు తెలియకుండా పంచాయతీ నిధులను ఎలా మళ్లిస్తారని అధికారులపై మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. చిరాగ్‌పల్లిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని సర్పంచ్‌లు కోరారు. గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ అవుతున్నాయని, లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ నాగిశెట్టి రాథోడ్, మాణిక్ ఎంపీడీఓ సుమతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వానికి వారధులు జర్నలిస్టులు

డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్


మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధులు జర్నలిస్టులని ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ ఎం.శివకుమార్ అన్నారు. పట్టణంలో శనివారం నియోజకవర్గం ఇన్‌చార్జ్ సిద్దన్న పాటిల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజెప్పడంలో జర్నలిస్టుల పాత్రను కొనియాడారు. జర్నలిస్టుల సంక్షేమానికి సహకారం అందిస్తానని సామాజిక ఉద్యకారుడు ఢిల్లీ వసంత్ తెలిపారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఫైసల్, జిల్లా అధ్యక్షకార్యదర్శులు యాదగిరి, విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఐక్యమత్యంతో సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు అనిల్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడిగా మినాజ్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మాణిక్‌పాటిల్, మల్లన్న, రాజేష్, కోశాధికారిగా ఎజాజ్ పాష, కార్యదర్శులుగా వీరభద్రప్ప, రఫీ, మల్లేశ్, బసవకుమార్, ఇక్రమాదొద్దీన్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా అయూబ్ పాష, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

కేంద్రం నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప


మాట్లాడుతున్న జన్‌వాడే సంగప్ప

నారాయణఖేడ్: కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప ఆరోపించారు. బీజేపీ బూత్ కమిటీల సమ్మేళనంలో భాగంగా శనివారం నారాయణఖేడ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, ఎల్ఈడీ లైట్లు, వైకుంఠధామాలు, రైతు వేదికలు, డ్రైనేజీ లైన్లు మొత్తం కేంద్రం నిధులతోనే నిర్మించారని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఖేడ్ అసెంబ్లీ ప్రభారీ అంబటి బాలేష్, జహీరాబాద్ పార్లమెంటరీ కన్వీనర్ రవికుమార్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, కో కన్వీనర్ మారుతిరెడ్డి, బీజేవైఎం పీఆర్టీ జిల్లా కన్వీనర్ రాజశేఖర్‌గౌడ్, బీజేపీ నాయకులు సాయిరాం, సంజీవ్‌పటేల్, సతీష్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి


విజేతలకు బహుమతులు అందిస్తున్న రమణ

రామచంద్రాపురం(పటాన్ చెరు): పోటీ ప్రపంచంలో ఆరోగ్యం పట్ల ప్రతీ ఒక్కరు శ్రద్ధ తీసుకోవాలని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో 48 కాలనీల సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు, ఆరోగ్యం సొంతం అవుతుందని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. టెన్నిస్ పోటీల్లో విజేతలు మనీ, వంశీ, అమిత్, శ్రీమన్, రమేష్, తేజను పలువురు అభినందించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఝరాసంగం(జహీరాబాద్): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న విలేజ్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. పోటీల్లో 36 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ నాయకుడు నరోత్తం, మాజీ సర్పంచ్ పెంటయ్య, నాయకులు అష్రాఫ్ అలీ, మాజిద్, హమీద్, అమీరొద్దిన్, ఫక్రొద్దీన్, దత్తు, మోహన్, రవికుమార్ స్వామి, గోపాల్, సుధాకర్ రెడ్డి, నిర్వాహకులు జావిద్, హుస్సేన్, సలవుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వేంకటేశ్వర ఆలయంలో పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): భక్తుల గోవింద నామస్మరణతో వెంకటాపూర్ శివారు వేంకటేశ్వర ఆలయం మారుమోగింది. శనివారం ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిల్వేరి వెంకటేశం, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

◆ అంత్యక్రియలకు సాయం

జిన్నారం(పటాన్‌చెరు): దోమడుగు గ్రామానికి చెందిన నాగమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం అందించగా, శనివారం నగదును సర్పంచ్ రాజశేఖర్ మృతురాలి కుటుంబ సభ్యులకు అందించారు.

◆ రేపు రాయికోడ్‌లో ఎమ్మెల్యే పర్యటన

రాయికోద్(అందోల్): మండలంలోని సింగితం గ్రామంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ చెక్కులను పంపిణీ చేస్తారని తహసీల్దార్ ప్రభు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 112 మందికి రూ. 1.11 కోట్ల విలువ చేసే చెక్కులను అందిస్తారని పేర్కొన్నారు.

◆ 'కంటి వెలుగు'పై అవగాహన

నారాయణఖేడ్: కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం కోసం ఈనెల 10న ప్రజాప్రతినిధులు, అధికారులతో అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11గంటలకు ఖేడ్ ఎంపీడీఓ కార్యాలయంలో కనిర్వహించే కార్యక్రమానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, ఐకేపీ సీసీలు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరు కావాలని కోరారు.

◆ కాలుష్యాన్ని నివారించాలి

జహీరాబాద్ టౌన్: మండలంలోని పలు గ్రామాల శివారుల్లో పరిశ్రమల వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో వెలువడే కాలుష్యాన్ని నివారించాలని మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు రాములు కోరారు. శనివారం ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎంపీపీ గిరిధర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ చుట్టూ ఉన్న పరిశ్రమల్లో వ్యర్థాలను యాజమాన్యాలు గుట్టు చప్పుడు కాకుండా కాల్చేస్తున్నారని అన్నారు. ఫైబర్ తదితర వ్యర్థాలను కాల్చడంతో వెలువడే పొగతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ సీసీ రోడ్డు పనుల పరిశీలన



జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని ఖాంజమల్ పూర్ గ్రామంలో శనివారం సీసీ రోడ్డు పనులు ప్రారంభమైయ్యాయి. రూ.20 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం సర్పంచ్ తుల్జమ్మ ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు జగన్మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, శంకర్, రామన్న, భీమన్న, వార్డు సభ్యుడు కృష్ణ పరిశీలించారు.

బూత్ కమిటీ సభ్యులు సిద్ధంగా ఉండాలి


మాట్లాడుతున్న సుగుణాకర్‌రావు

జహీరాబాద్: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు బూత్ కమిటీ సభ్యులు సిద్ధంగా ఉండాలని జహీరాబాద్ నియోజకవర్గ బీజేపీ పాలక్ సుగుణాకర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన బీజేపీ బూత్ కమిటీల సమావేశంలో మాట్లాడారు. బూత్ స్థాయి నాయకులకు సరల్ యాప్‌పై సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభారి నటరాజ్‌గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ కె.జనార్ధన్‌రెడ్డి, నాయకులు ఎన్.జగన్నాథ్, శ్రీనివాస్‌గౌడ్, సుధీర్‌కుమార్, సుధీర్ భండారి, మల్లికార్జున్ పాటిల్, శ్రీనివాస్‌గుప్తా, అడివన్న, వీరారెడ్డి, ఏక్‌నాథ్ పాటిల్, రాఘవేంద్రనాయక్, మల్లేష్, జగన్నాథ్, ప్రభాకర్ రెడ్డి, అవినాశ్, నరేష్ పాటిల్, సురేష్‌పూరి, సోమ అనిల్, బాల్‌రెడ్డి, వేణు, అనిత, అర్చన సారడా, శోభారాణి, అనిత పాటిల్ పాల్గొన్నారు.

ఏడీఏకు సత్కారం


కరుణాకర్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

జహీరాబాద్: ఉద్యోగ విరమణ చేసిన ఖేడ్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి శనివారం మండలంలోని రంజోల్ రైతు వేదికలో ఘనంగా సత్కరించారు. ఏడీఏలు భిక్షపతి, శ్రీనివాస్‌ప్రసాద్, ఆత్మ చైర్మన్ పెంటారెడ్డి, ఏఈఓ తదితరులు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఏఓలు రమేశ్, ప్రవీణ, లావణ్య, వినోద్‌కుమార్, ఏఈఓలు ప్రదీప్‌కుమార్, ప్రవీణ్, రవి, మోహన్, వెంకటేష్, ప్రేమ్‌రాజ్, రైతు బంధు సమితి అధ్యక్షుడు భాస్కరాచారి, రైతులు నారాయణరెడ్డి, సంజీవ్‌రెడ్డి, బద్రేశ్వర్, ప్రవీణ్, అశోక్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి


మందులను పంపిణీ చేస్తున్న వైద్యుడు

న్యాల్‌కల్(జహీరాబాద్): పశువులకు వ్యాధులు రాకుండా ముందు జాగ్రతగా టీకాలు వేయించాలని న్యాల్‌కల్ పశు వైద్యాధికారి అజింక్యా, బీఆర్ఎస్ నాయకుడు రాజ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని హద్నూర్‌లో నిర్వహించిన పశు వైద్య శిబిరంలో పశు పోషణాదారులకు మందులను పంపిణీ చేశారు. ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను రైతులు, పశు పోషణాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మాతంశెట్టి వీరమణి, వైద్య సిబ్బంది రాజయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోహీర్(జహీరాబాద్): మండలంలోని సజ్జాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఇంజనీర్ అబ్దుల్లా హబీబ్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని సజ్జాపూర్, పీచేర్యాగడి, మాచిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీఆర్ఎస్ విస్తరణకు కృషి చేయాలి


సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: కర్ణాటక రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ విస్తరణకు కృషి చేయాలని సీఎం కేసీఆర్ ఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డికి సూచించారు. శనివారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కర్ణాటకలో బీఆర్ఎస్ విస్తరణపై వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సరిహద్దు గ్రామాల్లో పార్టీలో చేరికలపై అభినందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఖేడ్‌లో పంట భూములకు నీరందించేందుకు బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం చేయాలని కోరారు. స్పందించిన సీఎం కేసీఆర్ నీటిపారుదలశాఖ అధికారులు, జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ విద్యుత్ కోతలపై సీఎండీ ప్రభాకర్‌రావుతో మాట్లాడి పరిష్కరించారని ఎమ్మెల్యే తెలిపారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

నియోజకవర్గ పాలక్ తుల ఉమ


బూత్‌కమిటీ సభ్యులతో తుల ఉమ, బాబూమోహన్

జోగిపేట(అందోల్): తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేని నియోజకవర్గ పాలక్ తుల ఉమ అన్నారు. శనివారం జోగిపేట వాసవి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మోదీ నేతృత్వంలో భారతదేశం ప్రగతి పథం వైపు పరుగులు తీస్తోందన్నారు. పనిచేసేవారికి పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. అనంతరం మాజీ మంత్రి బాబు మోహన్ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల పేరిట ఏర్పడిన తెలంగాణలో నియామకాలు కేసిఆర్ ఇంటికే పరిమితమయ్యాయని ఆరోపించారు. కేంద్ర నిధులతో రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని, ఎన్నికల ముందు ఉద్యోగ నోటిఫికేషన్లు అంటూ హడావిడి చేస్తున్నారని మండిపడ్డారు. అవినీతి ప్రభుత్వాన్ని ప్రజలు త్వరలోనే అంతమొందిస్తారని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ ఉదయ్‌బాబూమోహన్, నాయకులు చంద్రశేఖర్, కొత్త శ్రీనివాస్, జగన్నాథం, రాజు, ఆనంద్‌శర్మ, అశోక్, సతీష్, సుమన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కోహీర్ దర్గా ఉత్సవాలు


హిజ్రత్ సయ్యద్ మౌలానా మొహిజోద్దీన్ దర్గా

కోహీర్(జహీరాబాద్): పట్టణ శివారులోని హజ్రత్ సయ్యద్ మౌలానా మొహిజోద్దీన్ 764వ జాతర ఉత్సవాలు ఆది, సోమ, మంగళవారాల్లో నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. బండారీ కుటుంబం, దర్గా కమిటీ సభ్యులు అందించిన సమాచారం ప్రకారం ఆదివారం రాత్రి హజ్రత్ గౌరవార్థం సర్కారీ సందల్, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం జల్సా సీరతే ఔల్యా, సాయంత్రం 4 గంటలకు రామన్ సందల్ ఉంటుంది. సాయంత్రం నమాజ్ తర్వాత అన్నదానం సహపంక్తి భోజనాలు నిర్వహిస్తారు. రాత్రి 10 గంటలకు సనమ్‌వార్సి (మురాదాబాద్), గులాం వారిస్ సాబ్రి(మీరట్) ఖవ్వాలి కార్యక్రమం ఉంటుందన్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కుస్తీ పోటీలు, రాత్రి 10 గంటలకు ఖవ్వాలీ, ఖసాబులు సందల్ ఉంటుంది. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

విద్యాదానం గొప్పది


నిర్వాహకులను అభినందిస్తున్న డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): అన్ని దానాల కన్నా విద్యాదానం గొప్పదని వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు తోపాజి అనంత కిషన్ అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం పదో తరగతి జిల్లా స్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభా పోటీలను నిర్వహించారు. పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటో, నగదు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి, సంస్థ ఉప అధ్యక్షుడు హరీశ్, కౌన్సిలర్ నాగరాజ్, సోషల్ స్టడీస్ ఫోరం జిల్లా అధ్యక్షులు సునితా ఖన్నా, ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత


స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: స్వచ్ఛంద సంస్థలు పేద విద్యార్థులకు సాయం చేయాలని చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి కోరారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని జెడ్పీహెచ్ఎస్‌లో వి ఫర్ యు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి హాజరై విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. సమాజ సేవలో యువత భాగస్వామ్యం పెరగాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణ, చంద్రకళ గోపాల్, కో ఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, ఫౌండేషన్ ప్రెసిడెంట్ పి.వినోద్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ మల్లికార్జున్, ప్రవీణ్ కుమార్, మిట్టపల్లి అశోక్, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డంప్ యార్డును వేరే చోటుకు తరలించాలి


చైర్మన్‌కు సమస్యను వివరిస్తున్న మోడీ కాలనీవాసులు

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లో డంప్ యార్డును వేరే చోటకు తరలించాలని మోడీ కాలనీ ప్రతినిధులు కోరారు. శనివారం జిల్లాకు వచ్చిన మంత్రి హరీశ్‌రావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 కాలనీలకు ఒకే డంప్ యార్డు ఉండడంతో సమస్య ఎదురవుతోందని, డంప్ యార్డు నుంచి వచ్చే దుర్వాసనతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని అన్నారు. ఇక్కడ నుంచి వేరే చోటుకు తరలించాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కాలనీ ప్రతినిధి కేవీఎస్ శేషు తెలిపారు. అనంతరం డంప్ యార్డు సమస్యలను మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి దృష్టికి తీసుకవెళ్లినట్లు వివరించారు.

రేషన్ డీలర్‌పై ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): రేషన్ బియ్యం సక్రమంగా ఇవ్వడంలేదని డీలర్‌పై ఇబ్రహీంపూర్ గ్రామస్తులు ఆరోపించారు. ప్రభుత్వం రేషన్ బియ్యం అందిస్తున్నా తమకు పంపిణీ చేయడంలేదని గ్రామానికి చెందిన అశోక్ పాటిల్, ఏసప్ప, దేవదాస్, పర్షప్ప, సంగప్ప, హన్మంత్, మొగులప్ప తదితరులు శనివారం డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మిని కలిసి ఫిర్యాదు చేశారు.

ముగిసిన మల్లికార్జునస్వామి జాతర


స్వామి వారిని దర్శించుకున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్ రూరల్: ముగిసిన శ్రీ కేతకి భ్రమరాంబిక మల్లికార్జునస్వామి జాతర ఉత్సావాలు శనివారం రథోత్సవంతో ముగిశాయి. మండల గొల్లపల్లిలోని శ్రీ కేతకీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి జాతర నాలుగు రోజులుగా ఆలయ ఫౌండర్, నర్సాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం రథోత్సవంతో ఉత్సావాలు ముగిశాయి. రథోత్సవాన్ని ప్రారంభించి గ్రామంలోని పలు వీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమాలు ఆలయ అర్చకులు వేద పండితులు హరిప్రసాద్ శర్మ నేతృత్వంలో చేపట్టారు. స్వామి వారిని భువనగిరి మాజీ ఎంపీ బీజేపీ నాయకుడు బుర్ర నర్సయ్య గౌడ్, నర్సాపూర్ బీజేపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ గోపీ, సురేశ్, బాల్‌రెడ్డి, రఘువీరారెడ్డి, చిన్న రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.